ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు

హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ : ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి కోరారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పల్స్‌పోలియో వ్యాధి టీకాల కార్యక్రమం, జాతీయ నులిపురుగుల దినోత్సవం, స్టాప్ డైరీ క్యాంపెయిన్‌లపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈనెల 28వతేదీన ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు పోలియో బూత్‌లలో వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారన్నారు. అయిదు సంవత్సరాల లోపు పిల్లలను పోలియో బూత్‌లకు తీసుకువెళ్లి వేయించాలని ఆయన కోరారు. ఏదేని కారణాలతో ఆదివారం పోలియో చుక్కలు వేయించని వారి కోసం ఈ నెల 29,30తేదీల్లో సిబ్బంది ఇంటింటికి వచ్చి వారి పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. ఈవిధంగా వంద శాతం లక్ష్యాలను చేరుకోవాలన్నారు. దీని కోసం జిల్లా అంతర్ శాఖల అధికారుల సమన్వయంతో, సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. స్టాప్ డయేరియా గూర్చి వివరిస్తూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి పుట్ల శ్రీనివాస్, జిహెచ్ఎంసి వైద్యాధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'హరి ఉదాన్–26' అవార్డులు

ప్రజాపక్షం /హైదరాబాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ చూపిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు హరి యూనివర్సిటీ ఆధ్వర్యంలో గోల్డ్ మెడల్స్, సాల్కర్‌షిప్‌లు అందజేశారు. హైదరాబాద్ హరి వర్సిటీ ప్రాంగణంలో జరిగిన 'హరి ఉదాన్ 2026 – స్టేట్ మెరిట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ విద్య అనేది కేవలం ఉద్యోగం కాకుండా సమాజ నిర్మాణానికి, దేశాభివృద్ధికి ఉపయోగపడాలన్నారు. విద్యార్థులు నిరంతరం నేర్చుకొనే స్వభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెఎన్‌టియుహెచ్ విసి ప్రొ.టి.కిషన్ కుమార్ రెడ్డి, సిబిఐటి ప్రొ.డీన్ డాక్టర్ ఎన్.ఎల్.ఎన్. రెడ్డి, ప్రిన్సిపాల్ డా.సి.వి.నరసింహులు, హరి వర్సిటీ విసి డా.నర్సిరెడ్డి మల్లిరెడ్డితోపాటు 6 వేలమందికిపైగా విద్యార్థులు, తల్లిదండ్రు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోతుల బీభత్సం

ప్రజాపక్షం/రాంనగర్ : ఇప్పటి వరకు గ్రామాలలో మాత్రమే కోతుల బెడద ఉందని అనుకున్నా--- క్రమంగా పట్టణాల్లోకి కోతులు వచ్చేశాయి. అంతేకాకుండా ఏకంగా జీహెచ్ఎంసి పరిధిలోకి వచ్చేసి ప్రజలను హింసిస్తున్నాయి. ఈ క్రమంలోనే విద్యానగర్‌లో నివాస ప్రాంతాల్లోకి కోతులు ప్రవేశించి మనుషులపై దాడి చేస్తున్నాయి. ఓ మహిళపై కోతుల గుంపు దాడి చేయడంతో ఆమె తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. కోతులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ విషయంలో బల్దియా వెటర్నరీ విభాగానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

మోతె దంపతులకు ఆటా ఆహ్వానం

ప్రజాపక్షం/తార్నాక : అమెరికన్ తెలుగు అసోసియేషన్ నిర్వహించనున్న 19వ ద్వైవార్షిక ఆటా కాన్ఫరెన్స్ అండ్ యూత్ కన్వెన్షన్2026కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యమకారుల కమిటీ సభ్యుడు మోతే శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డికి ప్రత్యేక ఆహ్వానం అందింది. అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం, బాల్టిమోర్ నగరంలోని బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్లో ఈ సదస్సు జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆటా నిర్వాహకులు ఆహ్వానం అందించారు.

అమెరికా రాయబారితో అలీఖాన్ భేటీ

ప్రజాపక్షం/బంజారాహిల్స్ : అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా భారతదేశంలో యూఎస్ఏ రాయబారి, దక్షిణాసియా, మధ్య ఆసియా ప్రత్యేక రాయబారి సెర్గియో గోర్తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్, ఎంఏకే ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రాంగూడలోని అమెరికా కాన్సులేట్‌లో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మధ్య ఆసియాలో ముఖ్యంగా కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిజిస్తాన్‌లలో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలపై ప్రధానంగా చర్చించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాపక్షం/బంజారాహిల్స్: ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా పనిచేస్తున్నామని ఖైరతాబాద్ బిఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో సమస్యలపై సమరం కార్యక్రమంలో భాగంగా బుధవారం మన్నె గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. గత 8 నెలలుగా రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మహిళలు పెద్ద ఎత్తున తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.



ఇళ్ల పట్టాలిచ్చిన పేదలకు స్థలాలివ్వాలి

ఇందిరాపార్కు వద్ద ధర్నాలో ఆర్.కృష్ణయ్య

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇండ్ల పట్టాలు అందుకొన్న పేదలందరికీ 100 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ''పట్టాలు వద్దు.. ఇళ్ల స్థలాలు'' ముద్దు అంటూ నినదిస్తూ జాతీయ బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, కె.శ్రీనివాస్ సంయుక్త అధ్యక్షతన ఇళ్ల పట్టాలు తీసుకొన్న వందలాది మంది పేదలు భారీ ధర్నా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై, మాట్లాడారు. గతంలో ఘట్‌కేసర్ మండలం, కాచవేని సింగారం సర్వే నం.66లో 1500 మందికి , మొయినాబాద్ మండలం, హిమాయత్ సాగర్ సర్వే నెం.151లో 280 మంది పేదలకు ఇళ్ల పట్టాలిచ్చారన్నారు. కోర్టు కేసులు ఉండటంతో పొజిషన్ ఇవ్వలేదని, ఇప్పుడు కోర్టు కేసులు క్లియర్ అయ్యాయన్నారు. వెంటనే పేదలందరికీ పొజిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హిమాయత్‌సాగర్ సర్వే నం.151లో ప్రభుత్వం ఏర్పాటు చేయదలచుకొన్న కూరగాయల మార్కెట్‌కు, పూల మార్కెట్‌కు వ్యతిరేకం కాదని, ఇదే స్థలంలో గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాలను కేటాయించాలని కోరారు. కొంతమంది ఎంఆర్ఓలు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించినా రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై కోట్ల రూపాయలు అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారని, దీనిపై త్వరలో ప్రధాని మోదీని కలిసి సిబిఐ విచారణకు డిమాండ్ చేస్తానని కృష్ణయ్య తెలిపారు. సమావేశంలో బిసి కులాల ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోదీ రాందేవ్, బాకి రవి, చరణ్ యాదవ్, కె.శ్రీను, శివకుమార్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు చెక్కులు పంపిణీ

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ : రాజీవ్ రహదారి ఎస్ఎహెచ్01 ఎలివేటెడ్ కారిడార్ భూ నిర్వాసితులకు హైదరాబాద్ అదనపు కలెక్టర్ కదివరన్ పలని బుధవారం కలక్టరేట్‌లో చెక్కులు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల సూచనల మేరకు దాదాపు రూ.12కోట్ల చెక్కులు అందించామని అదనపు కలెక్టర్ తెలిపారు. చెక్కుల పొందిన నిర్వాసితులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నారాయణ, భూసేకరణ అధికారి ఎస్ఎహెచ్01 అపర్ణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా బోనాల ఏర్పాట్లు

ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట : తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలకు ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ ఛైర్మన్ జి.అరవింద్ కుమార్‌గౌడ్ తదితరులు హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. బుధవారం లాల్ దర్వాజా ఆలయ చైర్మన్ అరవింద్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఆలయ కమిటీ ప్రతినిధుల బృందం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మినిస్టర్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. వచ్చే నెల జులై 31వ తేదీ నుంచి ప్రారంభం కానున్న లాల్ దర్వాజా బోనాల ఉత్సవాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. మంత్రి కలిసి వారిలో జి.కాశీనాథ్ గౌడ్, కె.వెంకటేష్, జి.హరీష్ గౌడ్, జె.రాజేష్‌గౌడ్, ఎ.భరత్‌కుమార్, సుధీర్‌గౌడ్, రంగ హరినాథ్‌గౌడ్, జి.మణికంటేష్ గౌడ్, సాగర్ ముదిరాజ్, దుసరి నర్సింహగౌడ్, దుర్గేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాపక్షం/నల్లకుంట: రూ.20 లక్షల వ్యయంతో నల్లకుంట డివిజన్‌లోని గోల్నాక చర్చి గల్లీలో చేపడుతున్న సిసి రోడ్డు పనులను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబర్‌పేట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌గౌడ్, నాయకులు కూర నరేందర్, మూర్తి, రమణ నాయుడు, రఘురాంరెడ్డి, సురేష్ గౌడ్, బుచ్చిరెడ్డి, రుద్రయ్య, మహిళా నాయకులు గంగిశెట్టి లిఖితగౌడ్, అనుముల లావణ్య, వన్నాడి రమ్య, క్రిసోలైట్, అనిత తదితరులు పాల్గొన్నారు.

మెట్రో ఫేజ్ –1పై కాగ్‌తో ఆడిట్ చేయించాలి

సిటిజన్స్ ఫర్ బెటర్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధి డా.దొంతి నరసింహారెడ్డి

ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ : హైదరాబాద్ మెట్రో ఫేజ్–1 కార్యకలాపాలపై కాగ్‌తో ఆడిట్ చేయించి ఒక సమగ్ర ఆర్థిక నివేదికను ప్రజల ముందు పెట్టాలని సిటిజన్స్ ఫర్ బెటర్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధి డా.దొంతి నరసింహారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధి ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధి కె.వీరయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. మొదటి దశలోనే ప్రయాణికుల లక్ష్యాన్ని 40శాతం కూడా చేరుకోలేదు కానీ, రెండో దశకు రూ.38,595 కోట్లను ఏ ప్రాతిపదికన కోరుతున్నారని ప్రశ్నించారు. బస్సు చార్జిల కంటే మెట్రో రైలు చార్జీలు 2–3 రెట్లు ఎక్కువగా ఉన్నాయని, రోజువారీ కూలీలు, సామాన్యులు, విద్యార్థులు ప్రయాణించే పరిస్థితి లేదన్నారు. మెట్రో రెండో దశ మార్గాలు ప్రజా రవాణా సేవలకు అనువుగా ఉండాలని, ఐటి కారిడార్లు, రియల్ ఎస్టేట్ వృద్ధి ప్రాంతాలకైతే ప్రయాణం ప్రశ్నార్థకమేనన్నారు. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్ఎఫ్‌సి), హైదరాబాద్ మెట్రో రైల్ కోసం రూ.13,527 కోట్ల రీఫైనాన్సింగ్ ఒప్పందంపై సంతకం చేసిందన్నారు. దీనిద్వారా మెట్రో రైల్ హైదరాబాద్‌కు ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయో వెల్లడించాలని కోరారు. ఐఆర్ఎఫ్‌సి రీ ఫైనాన్సింగ్ ఒప్పందం పూర్తి షరతులను, నిబంధనలను,వ్యయాన్ని ఎవరు భరిస్తారనే దానితో సహా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ఆమోదానికి ముందు ఫేజ్–2 మార్గాలలో ప్రయాణికుల రద్దీ, అంచనాలను వెల్లడించాలన్నారు. మెట్రోలో రోజువారీ ఉద్యోగులు, చిన్న వ్యాపారస్థులు, విద్యార్థులు, వయోవృద్ధులకు ప్రయాణ రాయితీ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. కోట్ల రూపాయల పెట్టుబడితో జరిగే మెట్రో విస్తరణపై అన్ని పార్టీల ఏకాభిప్రాయం సామూహిక మౌనానికి సంకేతమని ఆయన పేర్కొన్నారు.

గ్లోబల్ కెరీర్ అపార అవకాశాలు

ప్రజాపక్షం/ఉస్మానియా వర్సిటీ : హోటల్ మేనేజ్‌మెంట్, క్యులినరీ ఆర్ట్స్ గ్లోబల్ కెరీర్‌కు అపార అవకాశాలు ఉన్నాయని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం అన్నారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ హోటల్ మేనేజ్‌మెంట్, క్యులినరీ ఆర్ట్స్ కళాశాలలు, తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్, తెలంగాణ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ ఆఫ్ క్యులినరీ అండ్ హాస్పిటాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మారుతున్న అవసరాలు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయం తన హాస్పిటాలిటీ పాఠ్యప్రణాళికను నిరంతరం అప్‌గ్రేడ్ చేస్తుందని చెప్పారు.

బీమా పథకం ప్రారంభానికి తరలిరావాలి

-టీజీఓ అధ్యక్షుడు ఎంబి కృష్ణయాదవ్ పిలుపు

ప్రజాపక్షం/గోషామహల్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఉద్యోగుల జీవిత బీమా పథకంను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 25న సాయంత్రం 4 గంటలకు రవీంద్రభారతిలో ప్రారంభించనున్నందున కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని హైదరాబాద్ జిల్లా టీజీఓ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, జిల్లా కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమానికి దోహదపడే కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లాకు చెందిన అన్ని శాఖల ఉద్యోగులు, సంఘ నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా టీజీఓ వైస్ ప్రెసిడెంట్‌లు ఆశన్న, ఎంజులారెడ్డి, ట్రెజరర్ వెంకటరమణ, ఈసీ సభ్యురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాపక్షం/ఫలక్‌నుమా : చార్మినార్ డివిజన్, సౌత్ సర్కిల్ సహాయ డివిజనల్ ఇంజనీర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 మధ్యాహ్నం 12 గంటల వరకు ఛత్రినాక,గౌలిపురా, మేకలమండి, సిఐబి క్వాటర్స్, సుల్తాన్‌షాహి, మేథర్‌వాడి, ఖానానగర్, మొఘల్‌పురా పీఎస్, తలాబ్‌కట్టా, మీర్‌కా దహారా, హరిబౌలీ, బేలా ప్రాంతాల్లో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు కోరారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ప్రజాపక్షం/అంబర్‌పేట్ : గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అంబర్‌పేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అతని నుంచి 864.76 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సిఐ టి.కిరణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 24వ తేదీ రాత్రి రామంతాపూర్ రోడ్డులోని పై ఎలక్ట్రానిక్స్ సమీపంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లి అతన్ని పట్టుకున్నారు. నేపాల్ దేశానికి చెందిన గోవింద్ ఖడ్కా (31) ప్రస్తుతం రామంతాపూర్‌లో నివాసముంటున్నాడు. నిందితుడి వద్ద నుంచి 3 సాచెట్లలో ప్యాక్ చేసిన 26.20 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

బాత్‌రూంలో యువతి ప్రసవం

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: హాస్టల్ బాత్‌రూంలో ఓ యువతి ప్రసవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఉదయం 4 గంటల సమయంలో చోటుచేసుకున్న ఘటనలో నవజాత శిశువు మృతి చెందడం కలకలం రేపింది. గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ సంక్షేమ కళాశాల హాస్టల్‌లో చదువుకుంటున్న ఓ యువతి టాయిలెట్‌కు వెళ్లి శిశువుకు జన్మనిచ్చినట్లు సమాచారం. భయంతో ఏం చేయాలో తోచని స్థితిలో ఉన్న ఆ యువతి శిశువును కిందకు విసిరేసినట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే యువతిని చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆసుపత్రిలో చేర్పించారు. అంతేకాకుండా మృతిచెందిన నవజాత శిశువును ఆసుపత్రికి తరలించారు. ఈ వ్యవహారంలో హాస్టల్ నిర్వాహకుల పర్యవేక్షణపై విమర్శలు వస్తున్నాయి. కాగా సమీప బందువు కారణంగానే ఆమె గర్భవతి అయ్యిందని ప్రచారం జరుగుతోంది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు.

గోదావరి ఫేజ్–2,3 పనుల పరిశీలన

ప్రజాపక్షం/హైద్రాబాద్ సిటీ: భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టు ఫేజ్2,3 పనులను జలమండలి ఎండి అశోక్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లన్నసాగర్ వద్ద నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్ పనులతో పాటు 3000 మిల్లీమీటర్ల వ్యాసం గల ప్రధాన పైప్‌లైన్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.

ఎస్ఐ నాగలక్ష్మికి సన్మానం

ప్రజాపక్షం/అంబర్‌పేట్ : సికింద్రాబాద్ జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పనిచేసిన నాగలక్ష్మి ఫీటీమ్స్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగలక్ష్మిని సిఐ మల్లీశ్వరి, ఇతర పోలీస్ సిబ్బంది శాలువాకప్పి పూలమాలలతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు.

ఐదు సర్కిళ్లు.. ఒక్కరే ఎసిపి

ఖైరతాబాద్ జోన్‌లో ఇదో వ్యవహారం?

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : అక్రమ నిర్మాణాలతో బల్దియా ఇప్పటికే అప్రతిష్టపాలవుతోంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలియని అయోమయం నెలకొంది. ఈ వ్యవహారం వివిఐపి ఖైరతాబాద్ జోన్‌లో నెలకొంది. ఫోకల్ పోస్టింగ్‌గా పేరొందిన ఖైరతాబాద్ జోన్‌లో ఐదు సర్కిళ్లు ఉండగా.. ఒక్కరే ఏసిపి విధులు నిర్వహిస్తుండటంతో అక్రమ నిర్మాణాల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. వివిఐపీలు నివాసముండే ప్రాంతం కావడంతో ఖైరతాబాద్ జోన్‌కు ఐఏఎస్ అధికారిని జెడ్‌సిగా నియమిస్తారు. ఐఏఎస్ అధికారి జెడ్‌సిగా ఉంటేనే జవాబుదారి తనం ఉంటుందని ప్రభుత్వం కూడా భావిస్తుంది. అయితే ఐదు సర్కిళ్లకు ఒక్కడే ఏసిపి ఉంటే క్షేత్రస్థాయిలో అక్రమ నిర్మాణాలను ఎలా పర్యవేక్షిస్తారు? అనేది ఊహకందడం లేదు. ఇక ఐదుగురు చేయాల్సిన పని.. ఒక్కరే చేయాల్సి రావడంతో ఆయనపై తీవ్రమైన పనిభారం పడుతోంది. అంతేకాకుండా విధులను ఆయన సక్రమంగా నిర్వహించలేకపోతున్నారు. ఇప్పటికైనా జెడ్‌సి స్పందించి బల్దియా బాస్ కర్ణన్‌కు విన్నవించి వివిఐపీ జోన్‌లో ఏసిపిలను పూర్తిస్థాయిలో నియమించే చర్యలు చేపట్టాలని ప్రజలు సైతం కోరుతున్నారు.

బిసి, ఇబిసి విద్యార్థుల ఉపకార వేతనాలకు నిధులు మంజూరు

బిసి సంక్షేమ శాఖ అధికారి జి.ఆశన్న

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ జిల్లాలోని బిసి, ఇబిసి విద్యార్థుల ఉపకార వేతనాల మంజూరి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి జి.ఆశన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల్లో చదువుకుంటున్న అర్హులైన వారందరికీ ఉపకార వేతనాలు అందుతాయన్నారు. 2026–27 విద్యాసంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థుల దరఖాస్తు ఫారాలను సంబంధిత ధృవీకరణ పత్రాలను జతపరిచి జిల్లా బిసి సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని ఆయన తెలిపారు.

కమాన్‌కు మరమ్మతులు చేపట్టాలి



ప్రజాపక్షం/అంబర్‌పేట్ : నూతన రోడ్డు నిర్మాణంలో భాగంగా అంబర్‌పేట్ అలీకేఫ్ చౌరస్తా నుంచి ప్రేమ్‌నగర్ వరకు చేపట్టిన పనుల్లో మూలమలుపులో ఉన్న వీరభద్ర ఆంజనేయస్వామి ముఖ ద్వారం (కమాన్) దెబ్బతిన్నదని, దానికి వెంటనే మరమ్మతులు చేయించాలని పటేల్‌నగర్ డివిజన్ బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బిజెపి డివిజన్ నాయకులు జూలూరి తిరుపతి గుప్తా, మైలారంరాజు, బీరెల్లి మనోజ్ యాదవ్, బండారి రాజు నేతలు రోడ్డు పనుల సందర్భంగా దెబ్బతిన్న కమాన్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నెల రోజుల క్రితం ఈ ప్రాంతంలో చేపట్టిన సిసి రోడ్ పనుల సందర్భంగా కమాన్ కింది భాగం పూర్తిగా ధ్వంసం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ మొయినుద్దీన్(సుల్తాన్)నిర్లక్ష్యంగా పనులు చేయించడం వల్లనే కమాన్ దెబ్బతిన్నదని, కమాన్‌కు మరమ్మతులు చేయించాలని పలుమార్లు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసినా పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. ఇకనైనా బల్దియా కమిషనర్ స్పందించి కమాన్‌కు మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు.

PROCLAMATION U/s 82 & 83 of Cr. P.C.
IN THE COURT OF THE HON'BLE IX JUDICIAL MAGISTRATE OF FIRST CLASS UMFC) AT MANORANJAN COURT COMPLEX, GANDHI BHAVAN, HYDERABAD

STC NI.I. NO. 314 OF 2023

BETWEEN:
Mr.B.Suresh kumar
...Complainant
AND
Mr Chevugoni Janaiah.
...Accused

To
Mr Chevugoni Janaiah, S/o.Sriramulu, H.No.2-66, Kethepally, Nalgonda District, TS-508211.

Take Notice that Complainant in STC NI.I. NO. 314 OF 2023 is filed for Offence under Section 138NI Act against the Accusedfor his presence in the Court. But you are hereby directed that, you have to appear in the said Court on 30-06-2026 at 10 a.m. as such you are hereby called upon to appear in person or through Advocate. If you have any kind of objection whatsoever, failing which the matter will be decided in your absence at your movables or immovables will be attached and sold out in Public Auction.

//BY ORDER OF THE HON'BLE IX JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, (JMFC) Through Advocate//

Sd/-
RAVI KUMAR. NEELAM LLB(LLM), Advocate
Address:1-162/1, Kyathi Law Chamber, opp Medipally police station, Medipally, Hyderabad 500098 Ph: 9701535399